www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -127 శుక్రవారం 21 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## డీలిమిటేషన్‌తో అన్యాయం చేయొద్దు

### మహాబలిపురంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

**పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడండి**

**చట్టసభల్లో స్థానాలు పెంచకుండానే మహిళా రిజర్వేషన్లు దక్షిణ ప్రాంతీయ మండలి**

**సమావేశంలో ముఖ్యమంత్రుల సూచన**

**చెన్నై: ఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**
తమిళనాడులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ (దక్షిణ ప్రాంతీయ మండలి) సమావేశంలో నియోజక వర్గాల పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్య పరిరక్షణ, నీట్ పరీక్ష, కావేరీ జలాల పంపిణీ, అధిక ఆర్థిక స్వయం ప్రతిపత్తి వంటి పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కాపాడేందుకు ఓ అధికారిక తీర్మానం చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కోరగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కారణంగా తమ ప్రాంత రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని తమిళనాడు



ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ డిమాండ్ చేశారు. నదీ జలాల నిర్వహణ, రవాణా, లాజిస్టిక్స్, తీరప్రాంత భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విపత్తు నిర్వహణ వంటి విషయాలలో దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత

మిగతా 2లో.

## మూడు భాషల విధానం అమలుపై సుప్రీం అభ్యంతరం

**సీబీఎస్ఈ 3 పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం**

**ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం**

**మూడు భాష విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందన్న ధర్మాసనం**



**ఢిల్లీఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**
సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (చీజూ 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.

మిగతా 2లో.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

### : రాహుల్ గాంధీ

**మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య**

**కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి**



**ఢిల్లీ ఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**
లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని

మిగతా 2లో.

## మరోసారి యుద్ధం వస్తే మరింత విధ్వంసం..



**కొత్త ఆయుధాలు బయటికి తీస్తాం: ఇరాన్**

**కొత్త క్షిపణులు మరింత కచ్చితత్వంతో, ఎక్కువ శక్తితో ఉంటాయని వెల్లడి**

**అమెరికాతో రహస్య చర్చలు జరుపుతున్నామన్న వార్తలను ఖండన**

**ట్రంప్ వ్యాఖ్యలను 'భ్రమ'గా పేర్కొన్న ఐఆర్‌జీసీ ప్రతినిధి**

2లో.

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు**

**ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య**

**నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య**




2లో.

## 5 బిల్లులు ఆమోదం

**శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్**

**విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు**

**ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది**

**అమరావతి ఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది.నేడు జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో

మిగతా 2లో.



## 22ఏ దుర్వినియోగం

**రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి**

**మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి**

**రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు బహిరంగలేఖ**

**హైదరాబాద్ఆగస్టు 20,(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో సెక్షన్ 22ఏ దుర్వినియోగం అవుతున్నదని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి జరుగుతున్నదని తెలిపారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో.





## భూ భద్రత కోసమే భూ భారతి

**గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**ఖమ్మం,ఆగస్టు 20 ,(ప్రజావినికిడి):** గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో

మిగతా 2లో.

## మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..

**ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం**

**కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన ఎస్‌వోపీ అమలు చేయాలని అధికారులకు ఆదేశం**



2లో.

### నా కుమార్తె వ్యాఖ్యలు

## పూర్తిగా వ్యక్తిగతం

**: క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ**


**హైదరాబాద్ఆగస్టు 20,(ప్రజావినికిడి):**
సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు.తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 21 ఆగస్టు 2026

## హనుమాన్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

# కాలనీ నమూనా లేఖ ను ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి కి అందజేత..





**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ డివిజన్ లోని జైపూరి కాలనీహనుమాన్ నగర్కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్..నూతన కమిటీ..ప్రెసిడెంట్ సాయి యాదవ్, వైస్ ప్రెసిడెంట్ అండాలు,ట్రెజరర్ స్వప్న,ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ సంధ్య,కవిత.. ఇతరులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసికాలనీ నమూనా లేఖ ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ,నూతన ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ వారికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీకి ఎల్లప్పుడూ మీరు అందుబాటులో ఉంటూ కాలనీ అభివృద్ధికై పాటుపడాలని అన్నారు.నేను కూడా మీ కాలనీకి వస్తాను ప్రస్తుతానికి 24 30వ తేదీల వరకు నియోజకవర్గంలో బోనాల సందడి ఉన్నందున మీకు టైం ఇవ్వలేకపోతున్నాను అని ఎమ్మెల్యే అన్నారు. తర్వాత మీ కాలనీనీ తప్పకుండాసందర్శించి మీ సమస్యలు తెలుసుకొని తప్పకుండా నెరవేరుస్తానని అన్నారు.



# 13 ఏళ్ల మెడికల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌కు.

## కన్స్యూమర్ కమిషన్ తీర్పుతో బాధితురాలికి న్యాయం..

### 80 వేల నగదు చెక్కును అందజేయించిన కన్స్యూమర్ కమిషన్ మీడియేటర్ డి.గోపాల్ నారాయణ..



కన్స్యూమర్ మీడియేటర్ డీ.గోపాల్ నారాయణ

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
గత 13 సంవత్సరాలుగా కొనసాగుతున్న మెడికల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన క్లెయిమ్‌ను న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ తిరస్కరించడంతో కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించిన బాధిత మహిళ ఆర్.లతాదేవికి న్యాయం లభించింది.రంగారెడ్డి జిల్లా కన్స్యూమర్ కమిషన్‌లో దాఖలైన కేసులో ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు ఆమెకు రూ.80 వేల మొత్తాన్ని చెక్కు ద్వారా చెల్లించారు.మెడికల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ను తిరస్కరించడంతో లతాదేవి కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించారు.ఈ కేసులో రంగారెడ్డి జిల్లా కన్స్యూమర్ కమిషన్ మీడియేటర్ సభ్యులు శ్రీ డి.గోపాల్ నారాయణ సుమారు13 సంవత్సరాల పాటు క్లెయిమ్ పరిష్కారం కోసం కృషి చేశారు.ఈ క్రమంలో ఆగస్టు 20వ తేదీ న లతాదేవికి రూ.80 వేల చెక్కును అందజేసి చెల్లింపు చేయించారు.
అడ్వకేట్ సహాయం లేకుండానే వినియోగదారురాలికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ,మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారానికి కృషి చేసిన డి.గోపాల్ నారాయణను పలువురు అభినందించారు.
ఈ సందర్భంగా కన్స్యూమర్ కమిషన్ గౌరవ ధర్మాసన సభ్యులకు,గౌరవ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.
ప్రతి వినియోగదారుడు తనకు అన్యాయం లేదా నష్టం జరిగినప్పుడు సంబంధిత బిల్లులు,రశీదులు,పత్రాలు అలాగే ఇతర ఆధారాలతో కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని డి.గోపాల్ నారాయణ తెలిపారు.
అదేవిధంగా రైతులు తమ పంటలు,విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు తదితర అంశాల్లో నష్టం జరిగినప్పుడు తప్పనిసరిగా బిల్లులు,రశీదులు భద్రపరుచుకోవాలని సూచించారు.
అవసరమైనప్పుడు ఆ ఆధారాలతో కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని తెలిపారు.వినియోగదారులకు న్యాయం జరిగేలా కన్స్యూమర్ మీడియేటర్,సర్వీస్ అడ్వకేట్, వినియోగదారుల హక్కుల కార్యకర్తల సహకారం అందిస్తామని డి.గోపాల్ నారాయణ పేర్కొన్నారు.ప్రతి వినియోగదారుడు తన హక్కులపై అవగాహన పెంచుకుని,అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



బాధిత మహిళ లతాదేవి

# విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తారా?

**జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి**

**పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర**

**విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలి**

**మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతి ఏటా అన్ని వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్నారని,డిప్లమా పూర్తి చేసిన వారికి సాంకేతిక రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని




తెలిపారు.అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం,దానికి విరుద్ధంగా(జీవో 97) తీసుకురావడం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు.రాష్ట్ర సాంకేతిక విద్యా పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యూనివర్సిటీల పరిధిలోకి మార్చే ప్రయత్నాలు చేయడం ద్వారా పాలిటెక్నిక్ కోర్సులను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థనే దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.విద్యార్థుల భవిష్యత్తు,పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు.ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చుకొని జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే, విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అవసరమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అంజయ్య యాదవ్ హెచ్చరించారు.

# ఆటో మీటర్ చార్జీలు పెంచాలి

**23వ తేదీ అర్ధరాత్రి నుండి ఆటో డ్రైవర్ల నిరవధిక సమ్మె**


**జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం**



**ఆబిడ్స్, (ప్రజావినికిడి):**
ఎలాంటి ఆర్థిక భారం పడని ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటో,క్యాబ్ డ్రైవర్ల నిరవధిక సమ్మె చేపడుతున్నామని ఆటో,క్యాబ్, యాప్ ఆధారిత సంఘాల జెఏసి కన్వీనర్ బి.వెంకటేశం, గౌరవ అధ్యక్షులు ముకేశ్ గౌడ్ లు వెల్లడించారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలోజె.ఏ.సి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 7.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, హైదరాబాద్ సుమారు 2.5 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం,ఆటోలు కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడం వల్ల డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే గిరాకీ తగ్గి ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ప్రభుత్వం వెంటనే ఆటో మీటర్ చార్జీలను పెంచాలని,ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ లేదా కార్పొరేట్ సంస్థలకు ఈ.వి ఆటోలు అందించే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**యువత దేశ అభివృద్ధి వైపు అడుగులు వేయాలి: రవీందర్ గౌడ్**





**ఎల్బీనగర్,ఆగస్ట్ 20(ప్రజావినికిడి):**మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82 వ జయంతిని పురస్కరించుకుని హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నగొని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.హయత్ నగర్ లోని తొర్రుర్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టెలికం వ్యవస్థ లో అనేక సంస్కరణలు తీసుకు వచ్చిన గొప్ప నేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు.18 సంవత్సరాలకే యువతకు ఓటు హక్కును కల్పించిన గొప్ప నాయకుడు అని అన్నారు.మహిళలకు స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చిన ఘనత రాజీవ్ గాంధీది అని అన్నారు.దేశ రక్షణ కొరకు యువత అంతా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.దేశం కొరకు ప్రాణాలు త్యాగం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్ రెడ్డి,బంజారా సేవా సమితి అధ్యక్షుడు మెగావత్ గోవర్ధన్ నాయక్, డివిజన్ మాజీ అధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్ యాదవ్,కే. శ్రీనివాస్, కారంటోత్ పాండు నాయక్, కళ్లెం సుజాత రెడ్డి,లెక్చరర్ కాలనీ అధ్యక్షుడు కళ్లెం నరసింహారెడ్డి, ఎర్ర మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెంటాల కృష్ణ, సుక్క వెంకటేష్, కేపీ వెంకటేష్, మనోజ్ కుమార్, హయత్ నగర్ డివిజన్ ఎస్టీ సెల్ నాయకులు ధనావత్ శీను, రామావత్ సంతోష్ నాయక్, కొర్ర హన్మంతు నాయక్, మాడుగుల చరణ్,శ్రీనివాస్ నాయక్,కొలను సుధాకర్ గౌడ్, సంతోష్ నాయక్, హనుమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# యువత సాంకేతిక చరిత.. మా రాజీవ్ గాంధీ ఘనత..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఘన నివాళి.. ఆసుపత్రిలో రోగులకు సేవలు..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
భారీ ఎత్తున హాజరైన కాంగ్రెస్ నాయకులు..నేటి యువత సాంకేతిక చరిత మా రాజీవ్ గాంధీ ఘనత.. భారతావనికి సరికొత్త సాంకేతిక దిశా నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్..అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఫరూక్ నగర్ మండల కేంద్రంలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రక్షక భటులే భక్షకభటులై అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని పొట్టలో పెట్టుకున్న తరుణంలో పైలట్ గా స్వయం ఉపాధితో జీవనం గడుపుతున్న రాజీవ్ గాంధీ ప్రజల కోరికతో, పార్టీ కోరికతో రాజకీయాలకు వచ్చి ప్రధానమంత్రిగా అనతి కాలంలోనే సాంకేతిక విప్లవం తెచ్చి దేశానికి కొత్త దిశను చూపించాడని ప్రశ్నించారు. నేడు యువత జీవితంలో భాగంగా మారిన సెల్ఫోన్, కంప్యూటర్ వంటివి రాజీవ్ గాంధీ సాధించిన ఘనతలు అని కొనియాడారు. ఈరోజు గ్రామీణ ప్రాంతంలో కూలి పని చేసే వాళ్ళ దగ్గర కూడా సెల్ ఫోన్ ఉందని, అది మాజీ ప్రధాని రాజీవ్ వల్లనే సాధ్యమైందని అభినందించారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, గడ్డం,(దంగు) శ్రీనివాస్ యాదవ్,శ్రీధర్, ఇబ్రహీం, పులిమామిడి శ్రీశైలం, ముబారక్ ఖాన్, ఖదీర్,చందు, అశోక్,కత్తి చంద్రశేఖర అప్ప, సింగపాగ అనిల్, ఉప సర్పంచ్ సీతారాం, మంగలి శ్రీశైలం, జయప్రకాష్ గౌడ్, గుట్ట రాజు, సాదిక్,బీరప్ప, ఇసాక్, మాధవులు, తంగిడిపల్లి శంకర్,రవితేజ, మహేందర్, మంగ అశోక్, సాయి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయొద్దు

**జీవో 97ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**డిప్లొమా, పాలిటెక్నిక్ విద్యను సివిల్ యూనివర్సిటీల్లో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వల్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని, జీవో నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు షాద్‌నగర్ ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన విద్యా విధానం, సాంకేతిక శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులు ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను యూనివర్సిటీలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరణ లేదా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానానికి అప్పగించరాదని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యా మండలిని బలోపేతం చేయాలిరాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పాత్రను కొనసాగిస్తూ మరింత అభివృద్ధి చేయాలని శ్రీకాంత్ కోరారు. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులను నియమించడంతో పాటు ప్రయోగశాలలు, భవనాలు,వసతి గృహాలు, పరికరాలు,ఇతర మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. డిప్లొమా విద్యను ప్రత్యేక వ్యవస్థగా కొనసాగించడం వల్ల విద్యార్థులకు ఉన్నత విద్యలో ఇంజినీరింగ్ తదితర కోర్సుల్లోకి వెళ్లేందుకు మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**విద్యార్థుల గొంతు నొక్కొద్దు :**విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై పోలీసుల జోక్యం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల గొంతులు నొక్కిన సీఐ రఘునాథ్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శక్తి పాలసీని వెనక్కి తీసుకోవడంతో పాటు జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ, విలీన ప్రక్రియల నుంచి కాపాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షులు అదిల్,చరణ్, రాంచరణ్, నాయకులు శివ, భాను,వంశీ, విష్ణువర్ధన్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు

# మండలంలో మలేరియా కేంద్ర బృందం పరిశీలన





**వాజేడు,ఆగష్టు 21,(ప్రజావినికిడి):**

పేరూరు, మలేరియా నివారణ, నియంత్రణ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు మలేరియా సెంట్రల్ టీం ప్రతినిధి లక్ష్మణ్, వారితో పాటు అశోక్, సురేష్, ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరూరు పరిధిలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు.

ఈ సందర్భంగా బృందం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీతో పాటు కృష్ణాపురం, కడేకల్ గ్రామాల్లో పర్యటించి మలేరియా నిర్ధారణ,రక్త నమూనాల సేకరణ,పరీక్షలు, కేసుల గుర్తింపు, రికార్డుల నిర్వహణ, అనుమానిత జ్వర కేసులపై తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను పరిశీలించింది.

గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా అనుమానిత కేసులను సకాలంలో గుర్తించడం,రక్త నమూనాలను సేకరించి పరీక్షించడం, పాజిటివ్ కేసులకు తక్షణమే తగిన చికిత్స అందించడం, కేసులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బందితో బృందం సమీక్ష నిర్వహించింది.

అలాగే మలేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలకు దోమల నివారణ చర్యలు, పరిసరాల పరిశుభ్రత, దోమతెరల వినియోగం, జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కూడా వివరాలు సేకరించారు.

ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధీర్,ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవితేజ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, ఎఎంఓ, దుర్గారావు, ఎస్ యు ఓ,నరసింహారావు, వెంకటరెడ్డి, ఎచ్ఈఓ,పి. వేణుగోపాలకృష్ణ తదితరులతో పాటు ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేసి, అనుమానిత కేసులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు ఆరోగ్య శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

# రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన వెనుక దేశవ్యతిరేక శక్తులు: ధర్మపురి అర్వింద్

**రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలపై ధర్మపురి అర్వింద్ విమర్శలు**

**రేవంత్ విదేశీ పర్యటనలన్నీ దేశంపై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతున్నాయని ఆరోపణ**

**కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని వ్యాఖ్య**

**ఆగష్టు 20(ప్రజావినికిడి):**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల లక్ష్యంగా నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ పెట్టుబడుల సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విదేశీ పర్యటనలన్నీ భారత్‌పై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతోందని ఆయన ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి భారత్ వ్యతిరేక భావజాలం కలిగిన వ్యక్తులు, సంస్థల నిధులతో నడిచే వేదికల వద్దకే సీఎం వెళుతున్నారని విమర్శించారు. దేశవ్యతిరేక ఐడియాలజీ ఉన్న సంస్థలను కలవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను హెచ్చరిస్తూ... గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయ నాయకుల మాటలు విని పలువురు అధికారులు చివరకు జైలుపాలు కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి వల్ల అధికారులకు ఎటువంటి రక్షణ ఉండదని, భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# కొత్తూరులో పోలీసులపై బాధితుల రాళ్ల దాడి..

**ఆందోళనకారులపై పోలీసుల లాఠీ చార్జ్..**

**కొత్తూరు లో ఉద్రిక్తత..**

**రోడ్డు ప్రమాదం కేసులో న్యాయం కోరుతూ కుటుంబ సభ్యుల ఆందోళన..**






**కొత్తూరు,(ప్రజావినికిడి):**మండల పరిధిలోని చేగూరు రోడ్డు తిమ్మాపూర్ వద్ద గత శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బొగ్గుల సాయి గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదని ఆరోపిస్తూ మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం,పోలీసులు వారిని పెద్దమ్మ తండా రోడ్డు వద్ద అడ్డుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో పోలీసులకు, కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు మోహరించినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన వ్యక్తి బాలానగర్ మండలానికి చెందిన ఓ మాజీ ఎంపీపీ కుమారుడని,అతను మైనర్ అని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే ప్రమాదానికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో మైనర్ డ్రైవర్ పేరు నమోదు చేయకుండా పోలీసులు వ్యవహరించారని వారు విమర్శించారు. మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన వ్యక్తి కావడంతోనే అతడిని తప్పించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ కొత్తూరు పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసుల అధికారిక స్పందన ఇంకా వెలువడాల్సి ఉంది. సాయి గౌడ్ మృతికి బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని,ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్‌ను సక్రమంగా నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ,న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సాయి గౌడ్ మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకోగా,పోలీసుల తీరుపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు కొత్తూరు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. ఇదిలా ఉండగా,కేసు విచారణకు సంబంధించి సమీపంలోని మరో పోలీస్‌స్టేషన్‌కు అధికారులు మకాం మార్చినట్లు సమాచారం.

**పోలీసుల పై రాళ్లదాడి**

కొత్తూరు పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగిన ఆందోళన సందర్భంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తుండగా వాగ్వాదం తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు పోలీసులపై రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది.

# ఏజెన్సీ న్యాయకలశాల కోసం సొంది వీరయ్య పాదయాత్ర

**ఆదివాసీ నవనిర్మణా సేన(ఎఎన్ఎస్) మద్దతు**

**పాదయాత్రలో భద్రాచలం ఐటిడిఏ కు చేరుకున్న ఆదివాసి నవనిర్మాణ సేన నాయకులు**




**వాజేడు,ఆగష్టు 20,(ప్రజావినికిడి):**

ఏజెన్సీ ప్రాంతంలో న్యాయకలశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఎదిర గుట్టల నుండి పాదయాత్ర చేస్తున్న గొండ్వానా సంక్షేమ పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సొంది వీరయ్య,కి గురువారం రోజున ఆదివాసి నవనిర్మాణ సేన నాయకులు సంఘీభావం తెలిపారు.

ఆదివాసీ సమాజం కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న సొంది వీరయ్య, చేపట్టిన ఈ పాదయాత్ర 4వ రోజు. గురువారం భద్రాచలం ఐటిడిఎ,కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎఎన్ఎస్, నాయకులు పాదయాత్రలో పాల్గొని,ఏజెన్సీ న్యాయకలశాల ఏర్పాటు డిమాండ్‌తో కూడిన మెమొరాండంను భద్రాచలం ఐటిడిఎ,ఎపిఓ,కి అందజేశారు.

సొంది వీరయ్య గురించి ఎఎన్ఎస్, నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు వెలుగులు నింపిన నాయకుడు సొంది వీరయ్య. ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న పోరాటానికి ఎఎన్ఎస్, సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు.

**ప్రధాన డిమాండ్లు**


ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు తక్షణ న్యాయం అందేందుకు ప్రతి ఐటిడిఎ, కేంద్రంలో న్యాయకలశాలను ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎస్, వ్యవస్థాపక అధ్యక్షులు కొర్సా. నరసింహమూర్తి ఎఎన్ఎస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం. నాగరాజు, ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్, వాజేడు మండల అధ్యక్షులు మొడెం నాగరాజు ముర్రం రామలక్ష్మి,పద్మ,ముర్రం రాజేష్ పాయం అజయ్ కుమార్,తలడి ప్రసాద్, కుదుముల నవీన్,కుంజ మహేష్,కంతి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# పల్లె సమస్యలపై పొన్నం ఫోకస్

**సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష.. ప్రజల వినతుల స్వీకరణ**







**ఎల్కతుర్తి/ఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలులో అర్హులకు ఎలాంటి అన్యాయం జరగొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పల్లె పల్లెకు పొన్నం అన్నపల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గురువారం కేశాపూర్, తిమ్మాపూర్, రామకృష్ణాపూర్, ఆరేపల్లి, బావుపేట గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామ పంచాయతీల వద్ద అధికారులతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు.

అధికారులు గ్రామాల్లో ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను మంత్రికి అందజేశారు. అనంతరం గ్రామస్థుల నుంచి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**రైతులకు రూ.22.22 కోట్ల భరోసా**

గ్రామంలో రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.22.22 కోట్లు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. రైతు రుణమాఫీ కింద రూ.2.11 కోట్ల రుణాలు మాఫీ కాగా, సన్న వడ్ల బోనస్ కింద రూ.49 లక్షలు విడుదలైనట్లు వివరించారు. ఒక రైతు కుటుంబానికి రూ.5 లక్షల రైతుబీమా మంజూరైందన్నారు. మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ కింద రూ.65.18 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. 46 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, భూభారతి కింద 13 దరఖాస్తులు పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి కింద 18 మందికి చెక్కులు అందజేసినట్లు తెలిపారు.

**త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇళ్లు**

త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. తిమ్మాపూర్‌లో అంతర్గత రోడ్లు, స్మశానవాటిక, మహిళా సంఘాలకు వీఓ భవనాలు నిర్మించాలని గ్రామస్థులు కోరగా. పాఠశాల ప్రాంతంలో వీఓ భవనం, అవసరమైన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.


**వర్షాభావంపై అప్రమత్తంగా ఉండాలి**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ప్రతి పొలంలో ఫామ్ కుంటలు నిర్మించుకోవాలని, జలసిరి కార్యక్రమం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.

**31 వరకు పెన్షన్ దరఖాస్తులు**

ఈ నెల 31 వరకు పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని మంత్రి వెల్లడించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, తలసేమియా బాధితులు, దివ్యాంగులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మోత్కుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, బొంత రమేష్, ముప్పు మానస మహేందర్, చక్రవర్తి స్రవంతి, రాజు, రవీందర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్, స్పెషల్ ఆఫీసర్ ఆదిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్టుపై దాడి..




**తెలంగాణ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు..**

**హబ్సిగూడ, కుషాయిగూడ పన్నీర్ వ్యవహారంపై న్యాయం చేయాలని వేడుకోలు..**

**మహిళపై దాడి, అసభ్య దూషణలు, సెల్‌ఫోన్ లాక్కున్నారంటూ ఫిర్యాదు..**

**పోలీసుల తీరుపై ఆవేదన,సమగ్ర విచారణకు డిమాండ్..**

**మహిళలపై శారీరక,మానసిక వేధింపులను సహించేది లేదని మహిళా కమిషన్ హెచ్చరిక..**


మహిళా జర్నలిస్టుపై దాడికి తెగపడ్డ దృశ్యం


మహిళ జర్నలిస్టు నుండి దౌర్జన్యంగా ఫోన్ లాక్కున్న దృశ్యం

**హైదరాబాద్, (ప్రజావినికిడి):** కల్తీ ఆహార పదార్థాల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో మహిళా జర్నలిస్టు పై దాడి జరిగిందని ఆరోపిస్తూ బాధితురాలు బొడిగె వాణి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లో పన్నీర్ ప్యాకింగ్‌కు సంబంధించిన వ్యవహారాన్ని అదేవిధంగా కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వద్ద కల్తీ పన్నీర్ అమ్మకాల వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లే సమయంలో తనపై దాడి చేశారని, అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి తోసివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించినప్పటికీ తనకు అసలు న్యాయం జరగలేదని బాధిత మహిళా జర్నలిస్టు ఆవేదన వ్యక్తం చేశారు.

### కల్తీని వెలుగులోకి తేవడం నేరమా.?

సమాజ శ్రేయస్సు,ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కల్తీ ఆహార పదార్థాలపై ఎంతో కష్టపడి సమాచారం సేకరించి, వాస్తవాలను నిర్ధారించుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జర్నలిస్టుల బాధ్యత అని బాధితురాలు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారే కల్తీ ఆహారాన్ని అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా,ఆ అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చి అధికారులకు సమాచారం ఇచ్చిన మహిళా జర్నలిస్టుపైనే దాడి జరిగిందని ఆరోపించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు

### మహిళపై దాడి, మానసిక వేధింపులు

సభ్య సమాజం తలదించుకునేలా ఒక మహిళా జర్నలిస్టుపై శారీరక దాడితో పాటు అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరించడం, ఫోన్ లాక్కోవడం వంటి భయాందోళనలను కలిగించే ఘటనలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలపై శారీరక దాడులు మాత్రమే కాకుండా మానసిక వేధింపులు, అవమానించడం, బెదిరింపులకు పాల్పడటం కూడా తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలని మహిళా హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు.
మహిళలు తమ వృత్తి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న సమయంలో వారిని భయపెట్టడం, దూషించడం, అడ్డుకోవడం లేదా దాడులకు పాల్పడడం ఏ రూపంలోనూ సమర్థనీయం కాదని మహిళా కమిషన్ స్పష్టమైన వైఖరిని కలిగి ఉండాలని వారు కోరుతున్నారు.

### మహిళలపై దాడులు సహించేది లేదు

మహిళలపై శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై దాడులు జరిగితే ఘటనను తీవ్రంగా పరిగణించి బాధితురాలికి భద్రత,న్యాయం కల్పించాల్సిన బాధ్యత ఉన్నత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.
మహిళల గౌరవం,భద్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమనే స్పష్టమైన సందేశాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఇవ్వాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

### దాడి చేసిన వారెవరు.? కేసులు ఎవరిపై.?

తమపై దాడి ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్నాయని బాధిత జర్నలిస్టులు చెబుతున్నారు. వీడియో ఫుటేజీ, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, పోలీసులకు అందించిన ఫిర్యాదులు తదితర ఆధారాలను పరిశీలిస్తే ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది తేలుతుందని వారు పేర్కొన్నారు.
తమ ఫిర్యాదును పూర్తిస్థాయిలో విచారించకుండానే ఎవరి ప్రోద్బలంతో జర్నలిస్టులపైనే కేసులు నమోదు చేశారనే ఆరోపణలపై కూడా ప్రత్యేక అధికారులచే సమగ్ర విచారణ జరిపించాలని మహిళా కమిషన్‌ను కోరుతున్నారు.

### పోలీసుల తీరుపై ప్రశ్నలు..

మహిళా జర్నలిస్టు తనపై దాడి జరిగిందని పోలీసులను ఆశ్రయించినప్పుడు ఆమె ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించారా.? ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీలు, వీడియో ఆధారాలను సేకరించారా.? ప్రత్యక్ష సాక్షులను విచారించారా.? దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.
మహిళా బాధితురాలి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, అసభ్య పదజాలాలతో దూషించడం, దాడి చేయడం, మహిళ నుండి బలవంతంగా ఫోన్ లాక్కోవడం నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### అక్రమార్కులకు అండగా మారుతుందా.?

కల్తీ ఆహార పదార్థాలపై సమాచారం ఇచ్చే వ్యక్తులు,వాటిని వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు భయపడే పరిస్థితి ఏర్పడితే అక్రమ వ్యాపారం చేసే వారికి మరింత ధైర్యం చేకూరే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.
ఉన్నతాధికారులు కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్న సమయంలో క్రింది స్థాయి అధికారులు ఫిర్యాదులు, దాడుల విషయంలో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తే ప్రభుత్వ చర్యలపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### పైస్థాయిలో ఉక్కుపాదం.. కిందిస్థాయిలో సహకారం.?

కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ కిందిస్థాయి అధికారులు వారికి సహకారం అందిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నంత అధికారుల ఆదేశాల అమలు ఎలా ఉందన్నది ఓయూ, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే కల్తీ వ్యాపారాలను ఎలా అరికడతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### మహిళా కమిషన్ జోక్యం చేసుకోవాలి

మహిళా జర్నలిస్టుపై జరిగిన దాడి, అసభ్య పదజాలాలతో దూషణలు, సెల్‌ఫోన్ లాక్కోవడం, తోసి వేయడం పోలీసులకు చేసిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, అందుబాటులో ఉన్న వీడియో, ఆడియో ఆధారాలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని బాధితురాలు కోరారు.
ఘటనలో మహిళపై దాడి జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించాలని, బాధితురాలికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం

మహిళలపై దాడులు, వేధింపులు, బెదిరింపులు, దూషణలు, అవమానకర ప్రవర్తన వంటి ఘటనలను సాధారణ విషయాలుగా తీసుకోకూడదని మహిళా సంఘాలు పేర్కొంటున్నాయిమహిళలు తమ వృత్తి,ఉద్యోగం లేదా ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సమయంలో వేధింపులకు గురైతే రాష్ట్ర మహిళా కమిషన్ వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం చాలా ఉందని మహిళలు కోరుతున్నారు.
మహిళా జర్నలిస్టుపై దాడి ఆరోపణలపై ఉన్నత అధికారులచే నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, మహిళలపై దాడులు,అసభ్య పదజాలాలతో దూషణలు, మానసిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ఫుడ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు
కల్తీ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి కానీ మహిళా జర్నలిస్టులపై కాదని అవినీతి, అక్రమాలు,కల్తీ వ్యాపారాలను వెలుగులోకి తీసుకువచ్చే వారిని భయపెట్టడం కాకుండా వారికి రక్షణ కల్పించాలని ప్రజలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. కల్తీ ఆహారంపై పోరాటం ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్నందున అసలు అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టం కఠినంగా వ్యవహరించాలని కానీ సమాచారం అందించిన వారిపై కఠినంగా వ్యవహరించడం కేసులు నమోదు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని, ఇప్పటికైనా ఉన్నత అధికారులు బాధిత మహిళా జర్నలిస్టుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు,తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

---

## విమర్శనాత్మక వార్తలపై జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు సరికాదు.

**న్యూఢిల్లీ ఆగస్టు.20,(ప్రజావినికిడి):**



ప్రభుత్వాన్ని విమర్శిస్తూ జర్నలిస్టులు వార్తలు లేదా కథనాలు రాశారనే కారణంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛను గౌరవించాలని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కింద జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయని దేశ అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. కేవలం ఒక జర్నలిస్టు రాసిన కథనం ప్రభుత్వంపై విమర్శగా కనిపించిందనే కారణంతో అతనిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని అధికారుల నియామకాల్లో కుల సమీకరణాలపై ఆయన రాసిన కథనం నేపథ్యంలో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ పిటిషన్‌ను జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్.వీ.ఎన్. భట్టితో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ.. సంబంధిత కథనానికి సంబంధించి ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఉత్తర్వులు జారీ చేసింది.

## జర్నలిస్టులకు హౌసింగ్ సౌకర్యం కల్పించాలి.

**-ఎమ్మెల్యే గళ్ళా మాధవి.**

**-జర్నలిస్టుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి.**



**అమరావతి ఆగస్టు.20.,(ప్రజావినికిడి):** అమరావతి వెలగపూడిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల జీరో అవర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా నిలిచే జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రజా సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే కీలక బాధ్యతను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విలేఖరులలో అధిక శాతం మంది అత్యల్ప వేతనాలతో పని చేస్తున్నారని, సొంత ఇల్లు నిర్మించుకోవడం వారికి పెద్ద సవాల్‌గా మారిందని తెలిపారు. జర్నలిస్టుల వృత్తిలో స్థిరత్వం, నిర్దిష్టమైన పని వేళలు లేకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్డులు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రోత్సాహకాలు జర్నలిస్టుల కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పిస్తాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో జర్నలిస్టు కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి వర్గాన్ని తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారి అభ్యున్నతి కోసం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు గృహ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జి.ఓ. నెం. 67, 107లను తీసుకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ జీవోలను అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదంటే గృహ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సభ ద్వారా కోరారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

**ఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**
దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ధరలతో సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల కట్టడికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం తమ పరిధిలో
లేదన్నరీతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సొంత ఎజెండాలను ముందుకేసుకుని నడుస్తున్నాయి. ప్రజలు ఏమయితేనేమీ అన్న భావనలో పాలకుల తీరు ఉంది. ఎన్నికలప్పుడు మేనేజ్ చేయడం నేర్చుకున్న
వారు ఆ తరవాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎదుటి పార్టీలను బురిడీ కొట్టించడం, నానాయాగీ చేయడం తప్ప పాలన కట్టుతప్పి పోతోంది. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఫైన్ రైస్ కిలో బియ్యం ధర 80 రూపాయలకు చేరింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని, వందకు చేరుకుంటుందని అంటున్నారు. ఎల్‌నినోతో ఉత్పత్తి తగ్గిందన్న సాకుతో ధరలు పెంచేశారు. అలాగే ఉప్పులు పప్పులు, నూనెల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచేస్తున్నారు. ఇవన్నీ ఎవరి పరిధిలో ఉందో ప్రజలకు తెలియడం లేదు.
ఇక కూరగాయల ధరలు కూడా 60 నుంచి వంద వరకు పలుకుతున్నాయి. అయితే ఎపిలో సబ్సిడీ బియ్యం పథకం ప్రారంభించారు. ఇది పెద్దగా ప్రజామోదం పొందలేదు. పాలకులు సొంత ఎజెండాతో, పార్టీ పరంగా విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉన్నారు. ఎపిలో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అన్న రీతిలో వైకాపా, టిడిపి కూటమి పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ నడుస్తున్నా అందులో ధరలపై ఎజెండా లేదు. తెలంగాణలో 22ఎ వ్యవహారం ముదిరింది. ప్రజలను రోడ్డుకీడ్చిన రేవంత్ సర్కార్ వారి నుంచి భూములను లాక్కునే ప్రయత్నంలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రులంతా వసూళ్లలో పడ్డారని, 30 శాతం కమిషన్ ప్రభుత్వం అని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. బిఆర్ఎస్‌ను విమర్శించడంలో కాంగ్రెస్ బిజీగా ఉంది. ఇక బిజెపి వందేమాతరం, డీలిమిటేషన్, కొత్త కార్యవర్గం కూర్పుతో బిజీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడం, యువతకు క్షమాపణలు చెప్పండి అన్న పనిలో పడింది. మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ సొంద ఎజెండాతో నడుస్తున్నాయి. అందువల్ల ధరల దాడి వాటికి పట్టడం లేదు. బిజెపి అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా ఈ వ్యవహారాలను చూడడం లేదు. పార్టీలో కొత్త కార్యవర్గం, రానున్న పలు రాష్ట్రాల ఎన్నికలతో తలమునకలుగా ఉంది.




తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో మళ్లీ రామ్ మాధవ్‌కు చోటు కల్పించారు.దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్ధాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా,14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి 'సంఘ్' వాసనలు ఉన్నాయని అంటున్నారు. ఎలాంటి సమాచారాన్ని అయినా సత్వరం ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం వంటివి జరిగాయి. ఒకప్పుడు వెంకయ్య, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర దిగ్గజ నేతలతో అలరారిన పార్టీ ఇప్పుడు పేలవంగా తయార వుతోంది. నితిన్ నబీ అధ్యక్షుడు అయ్యాక పార్టీ పెద్దగా ప్రభావశీలంగా కనిపించడం లేదు. గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి ఎప్పుడూ మోడీ ముందుంటారు. అయితే అందులో ధరలు తగ్గించగలిగామని ఎప్పుడూ చెప్పలేదు. ధరలపై సమీక్షకు పెద్దగా సమయం కేటాయించ లేదు. తాజాగా ఇప్పుడు దిమాగీ నక్సల్స్ మాటతో మళ్లీ కొత్త చర్చ లేపారు. అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన అనుభవంతో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను
పెద్దగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేవలం ఎన్నికలు, గెలుపు అన్న ధోరణిలో పాలన
సాగిస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలిస్తే పాలక పార్టీలు ఏవీ కూడా ధరల గురించి మాట్లాడడం లేదు. 80కి కిలో బియ్యం కొనడమెలా ఆలోచించడం లేదు. జిఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయా లేదా అన్నది చూసుకుంటూ మురిసిపోతున్నారు. ప్రజల విషయంలో ఇప్పటికైనా ఆలోచన చేయాలి. ధరల పెరుగుదలను అరికట్టడమెలా అన్నదానిపై దృష్టి సారించాలి. లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్కెట్ మారిపోవడం ఖాయం.

## భారీగా పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 20,(ప్రజావినికిడి):**అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు భారీ పెరుగుదల నమోదు చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మార్కెట్ అంచనాలు కూడా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.4300 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,46,000గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.3950 మేర పెరిగింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలోకు రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది.

---------

## మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

### ప్రసవం కోసం వెళ్లిన సమయంలో నిర్లక్ష్యంగా సర్జరీ



**ముంబై,ఆగస్టు 20,(ప్రజావినికిడి)::**ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. మహిళ ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. రిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

## అద్దెకున్న యువకుడి దురాగతం

### ప్రశ్నించిన పాపానికి ఓనర్ దారుణహత్య

**విశాఖపట్టణం,ఆగస్టు 20,(ప్రజావినికిడి):**
విశాఖ నగరంలో ఓ విశ్రాంత ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో అద్దెకున్న వారిని ప్రశ్నించినందుకు వారే ఈ హత్యకు ఒడిగట్టారు. వివరాల్లోకి వెళితే.. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్‌లో అ÷-దదెకు ఉన్న ఐదుగురు యువకులు మూడు రోజుల క్రితం ఎ÷-లాట్‌ను ఖాళీ చేశారు. అయితే, వారు ఖాళీ చేసిన ఫ్లాట్‌లోని సామగ్రి ధ్వంసం చేశారనే కారణంతో యజమాని దుర్గాప్రసాద్ యువకులను పిలిపించారు. ఆయనతో మాట్లాడేందుకు వచ్చిన ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ జరిగింది. వారిలో ఓ యువకుడు దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో ఆయన మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వందేమాతరంపై రాజకీయ వివాదం

### కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బిజెపి -కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నబీన్ విమర్శలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 20,(ప్రజావినికిడి):**జాతీయ గేయం 'వందే మాతరం' విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తు తోందని ఆరోపించింది. వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించిన కాంగ్రెస్‌పై భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ



నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటుచేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ.. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు. 1931లో వందే మాతరం పూర్తి రూపంపై ముస్లిం లీగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ నిర్ణయం కూడా అదే తరహా మొండితనాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది.

## 'రక్షాబంధన్‌కు పీఎం-కిసాన్ కింద రూ.4000' ప్రచారంపై స్పందించిన కేంద్రం

### తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులకు అధికారుల సూచన

**ఆగస్టు 20,(ప్రజావినికిడి):**
పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఒక నకిలీ వార్త విస్తృతంగా ప్రచారమవుతోంది. రాఖీ పండుగ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి 24వ విడతగా రూ. 4,000 జమ చేయనుందంటూ ఒక వీడియో చక్కర్లు కొడుతోంది. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఇది పూర్తిగా నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది.
ఈ వీడియోను ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)




టెక్నాలజీ ఉపయోగించి సృష్టించారని అధికారులు తేల్చారు. రక్షాబంధన్‌కు ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని పీఐబీ స్పష్టతనిచ్చింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించింది.
వాస్తవానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చివరిసారిగా జూన్ 20న పీఎం-కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేశారు. 24వ విడత నిధుల విడుదల తేదీపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు.
ఈ పథకం కింద అర్హులైన రైతులకు ప్రతి ఏటా మూడు సమాన వాయిదాలలో రూ.2,000 చొప్పున మొత్తం రూ.6,000 ఆర్థిక సహాయం అందుతుంది. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్లను, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని, అనధికారిక ప్రచారాలను నమ్మవద్దని అధికారులు ప్రజలను కోరుతున్నారు.

## ఆదాని డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

### రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం


**అమరావతిఆగస్టు 20 ,(ప్రజావినికిడి):**ఏపీలో డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదానీ ఇన్ఫ్రా ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి సంబంధించిన విక్రయ ఒప్పందాల్లో మార్పులకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదానీ ఇన్ఫ్రా అనుబంధ సంస్థలైన విశాఖ హైపర్‌స్కేల్, మెగా, రాంబిల్లి డేటా సెంటర్ పార్కులకు సవరించిన నిబంధనలు వర్తించనున్నాయి. రాష్ట్రంలో డేటా సెంటర్ల ద్వారా భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో విదేశీ వాణిజ్య రుణాలు పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూ కేటాయింపు రద్దు నోటీసులు జారీ చేయడానికి ముందు సంస్థలకు 30 రోజుల సమయం ఇచ్చేలా ఒప్పందంలో సవరించింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5.84 ఎకరాల భూమిని అదానీ సంస్థకు లీజుకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయ శాఖ భూములకు వర్తించే లీజు రేట్ల ప్రకారం, ఎస్ఆర్ఓ విలువలో 3 శాతం చొప్పున లీజు రేటును నిర్ణయించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జీఎస్టీ ఆదాయం రాష్ట్రానికే వచ్చేలా డేటా సెంటర్ నిర్మాణాలు, సరఫరాదారులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# యువరాజ్ సింగ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ !

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరాజ్ సింగ్ కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే మెంటార్‌గా ఆటగాళ్లకు దిశానిర్దేశం చేస్తున్న యువరాజ్ సింగ్.. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అధికారికంగా ఇప్పటి వరకు కోచ్‌గా వ్యవహరించలేదు. అప్‌కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో యువరాజ్ సింగ్ కోచ్‌గా అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే యువరాజ్ సింగ్ నియామక ప్రక్రియ పూర్తయిందని, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే బాధ్యతలు స్వీకరిస్తాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027 మినీ వేలంలో యువరాజ్ సింగ్ పాల్గొంటాడని తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం ఇచ్చేందుకు ఢిల్లీ యాజమాన్యం సిద్ధమైందని సమాచారం. రూ.9.5 కోట్ల భారీ వేతనంతో యువరాజ్ సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఓ కోచ్ అందుకున్న అత్యధిక పారితోషకం ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రికీ పాంటింగ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ రూ.9 కోట్ల వేతనం అందుకుంటున్నట్లు సమాచారం. అతని తర్వాత స్టీఫెన్ ఫ్లేమింగ్ రూ.7.5 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ డైరెక్టర్‌గా జహీర్ ఖాన్ రూ. 5 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రూ.4.5 కోట్లు, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్ రూ.4 కోట్ల చొప్పున వేతనం తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. యువరాజ్ సింగ్ పర్యవేక్షణలోనైనా ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ జట్టు ఉంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న రిషభ్ పంత్.. తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభంలో మెరుగైన ప్రదర్శన చేసినా.. కీలక సమయంలో చేతులెత్తేసింది. 14 మ్యాచ్‌ల్లో 7 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది.



# బీసీసీఐపై మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం



భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)పై మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ విన్నర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు వస్తున్నాయని, అతనిపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించాడు. జూనియర్ లెవెల్ క్రికెట్ సెలెక్షన్‌లో ఎంపికయ్యేందుకు మిథున్ మన్హాస్ ఏజ్ ఫ్రాడ్‌కు పాల్పడినట్లు జమ్మూ కశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ జాయింట్ సెక్రటరీ సుదర్శన్ మెహతా ఆరోపించారు. మాజీ డీఎస్పీ అయిన సుదర్శన్ మెహతా.. మిథున్ మన్హాస్‌పై చర్యలు తీసుకోవాలని కోర్టును కూడా ఆశ్రయించారు. సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని నేషనల్ టోర్నీల ఎంపికకు అర్హత సాధించేందుకు మన్హాస్ రెండు వేర్వేరు పట్టిన తేదీలను సమర్పించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబర్ 3లోపు నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ న్యూస్ క్లిప్‌ను ఎక్స్ వేదికగా షేర్ చేసిన కీర్తి ఆజాద్.. బీసీసీఐ ఏం చేస్తుందని విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏం చేస్తోంది? ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మిథున్ మన్హాస్‌కు రెండు వేర్వేరు జన్మదిన తేదీలు ఉన్నాయి . ఒకటి బీసీసీఐలో నమోదైతే.. మరొకటి డీడీసీఏలో నమోదైంది. బీసీసీఐ తన సొంత అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటుందా?'అని అని కీర్తి ఆజాద్ ప్రశ్నించారు. కీర్తి ఆజాద్ పోస్ట్‌తో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. మాజీ దేశవాళీ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ జమ్మూకశ్మీర్‌కు చెందినవాడు. జమ్మూకశ్వీర్ తరఫున కెరీర్ ప్రారంభించిన అతను ఆ తర్వాత న్యూఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినా.. టీమిండియా తరఫున ఆడే అవకాశం అతనికి రాలేదు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించాడు. ఏజ్ క్రికెట్ కోసం తన బర్త్ డే డేట్‌ను 9/12/1977 పేర్కొన్న మిథున్ మన్హాస్.. ఢిల్లీకి ఆడే సమయంలో 12/10/1979గా పేర్కొన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఈ ఆరోపణలపై మిథున్ మన్హాస్ కానీ, బీసీసీఐ కానీ ఇప్పటి వరకు స్పందించలేదు.

# సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు

**• సౌతాఫ్రికా**

**క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్**

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మోహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు.

విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి.
కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.





# శ్రీలంకతో రెండో టెస్ట్‌కు కుల్దీప్‌పై వేటు!!

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నదమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది. తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్.. రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తా చాటగా.. జడేజా నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి. అయితే కుల్దీప్ యాదవ్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అనగా.. అతి తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసి ఎక్కువ పరుగులిచ్చాడని ఆకాశ్ చోప్రా తెలిపాడు. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు. మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలని అశ్విన్ సూచించాడు. ఆకాశ్ చోప్రా మాత్రం కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనా వేసాడు. మరి టీమ్‌మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా.. సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా.. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకీబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు భారత్ తుది జట్టు(అంచనా)
యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్/కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ/గుర్నూర్ బ్రార్.

# క్వార్టర్‌ఫైనల్‌కు గాయత్రి-త్రీసా

**సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ కూడా..**

**ప్రీ క్వార్టర్స్‌లో ఓడిన సింధు, ఆయుశ్**

**బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్**



**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ సింగిల్స్‌లో పివి సింధు, ఆయుశ్ శెట్టి పోరాటం ప్రీ క్వార్టర్ ఫైనల్లో ముగియగా.. మహిళల, పురుషుల డబుల్స్‌లో భారత షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. ఈ జోడీలు సెమీస్‌కు చేరితే కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గురువారం ఉత్కంఠభరితంగా సాగిన మహిళల సింగిల్స్‌లో సింధు 11-21, 21-15, 17-21తో 3వ సీడ్, చైనా షట్లర్ వాంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి ఇండోనేషియాకు చెందిన 11వ సీడ్ అల్వీ ఫర్హాన్ చేతిలో 19-21, 11-21తో వరుస గేముల్లో ఓటమిపాలయ్యాడు. దీంతో తొలిరౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ షి యూకీని ఓడించి సంచలనం సృష్టించిన ఆయుష్.. ప్రీ-క్వార్టర్ ఫైనల్‌లోనే తన ప్రయాణాన్ని ముగించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో పోరాటం ముగిసింది. ప్రీ క్వార్టర్స్‌లో వీరు 16-21, 5-21తో 6వ సీడ్, చైనా షట్లర్ల చేతిలో చిత్తుగా ఓడారు.

**క్వార్టర్స్‌కు గాయత్రి, త్రీసా జోడీ...**

మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్-త్రీసా జోలీ జంట సంచలనం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్లో ఏకంగా ఏడో సీడ్‌ను జంటను చిత్తుచేశారు. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో గాయత్రి-త్రీసా జంట 21-16, 21-12తో జపాన్‌కు చెందిన కీ నకనిశి జంటకు షాక్ ఇచ్చారు. తొలి సెట్‌ను 21-16తో నెగ్గిన భారత అమ్మాయిలు.. రెండో సెట్‌నూ 21-12తో సెట్‌ను గెలిచి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. ఆ తర్వాతి రౌండ్‌లో గాయత్రి-త్రీసా జంటకు నాలుగో సీడ్ జియా యి ఫాన్ -- ఘాంగ్ షు గ్జియాన్(చైనా)తో గట్టి పోటీ ఎదురుకానుంది. ఇక పురుషుల డబుల్స్‌లో 5వ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట మూడుసెట్ల హోరాహోరీ పోరులో మలేషియా జంటను చిత్తుచేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ప్రీ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ 21-23, 21-19, 21-19తో మలేషియాకు చెందిన ఆరిఫ్-యాప్‌లను చిత్తుచేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మ్యూజికల్ డ్రామా..జగమే సంగీతం

### అమెజాన్‌లో 4నుంచి వెబ్ సీరిస్

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్దాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.




# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

### ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

----------------

# రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల




'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే
ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.

# రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది : వరుణ్ తేజ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు.త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు.రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, "చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక" అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.


# మమితా బైజు .. మరో మూవీతో సిద్ధం



'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ కొత్త సినిమా టైటిల్ ఇదే..

విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇంతవరకు #VenkyAnil5, #NKRAR2 పేర్లతో ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను ప్రత్యేక వీడియో ద్వారా ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు నివాళిగా 'అప్పుల అప్పారావు'లోని ఓ హాస్య సన్నివేశాన్ని గుర్తు చేస్తూ వీడియోను మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ తనకు స్ఫూర్తి అని అనిల్ రావిపూడి పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే.వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతిశెట్టి కలిసి అనిల్ రావిపూడిని సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. అందుకు ఆయన ఎలాంటి తడబాటు లేకుండా 'జనవరి 12 విడుదల' అని చెబుతారు. దీంతో నటీనటులు కాసేపు అయోమయానికి గురవుతారు. తాము విడుదల తేదీ గురించి కాదు.. టైటిల్ గురించి అడిగామని చెబుతారు. చివరికి అదే సినిమా టైటిల్ అని అనిల్ వెల్లడించడంతో వీడియో ముగుస్తుంది.కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సినీ పరిశ్రమలో ఆయన 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పోస్టర్‌ను తీసుకొచ్చారు. ఇందులో లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్‌రెడ్డిగా వెంకటేశ్ కనిపించారు.భారత సైన్యంలో పనిచేసే ఈ అధికారి కౌంటర్ టెర్రరిజం, బందీలను రక్షించే కార్యకలాపాల్లో నిపుణుడిగా ఉంటారని పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఆర్మీ దుస్తుల్లో, సన్‌గ్లాసెస్‌తో, ఓ కారు పక్కన వెంకటేశ్ కనిపించిన తీరు ఆకట్టుకుంది.వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్‌కు కృతిశెట్టి జంటగా కనిపించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌తో పాటు అనిల్ రావిపూడి మార్క్ వినోదం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. సమీర్‌రెడ్డి కెమెరామెన్, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613